క్లుప్తంగా

ప్రతి ఎకరాకు సాగునీరు అందిస్తాం



అప్పాపురంలో చానల్‌లో నాచు తొలిగింపు

కాకుమాను: అప్పాపురం చానల్ ద్వారా మండలంలోని ప్రతి ఎకరాకు సకాలంలో సాగునీరు అందిస్తామని వ్యవసాయ సలహా మండలి జిల్లా చైర్మన్ నల్లమోతు శివరామకృష్ణ తెలిపారు. పెదనందిపాడు మండలం పమిడివారిపాలెం నుంచి కాకుమాను వరకు అప్పాపురం చానల్‌లో నాచు తొలగింపును ఆదివారం చేపట్టారు.ఈ సందర్భంగా శివరామకృష్ణ మాట్లాడుతూ ప్రత్తిపాడు నియోజకవర్గ శాసన సభ్యురాలు మేకతోటి సుచరిత, కలెక్టర్ సహకారాలతో చానల్‌లో నాచును కూలీలతో తొలగిస్తున్నట్లు తెలిపారు. దీని వల్ల చానల్ కింద సాగు చేస్తున్న రైతులందరికీ సరిపడా సాగు నీరు సకాలంలో అందుతుందని ఆయన పేర్కొన్నారు.

కనకదుర్గమ్మకు నృత్య నీరాజనం



గుంటూరు ఎడ్యుకేషన్: అమరావతి రోడ్డులోని హిమనీనగర్‌లో స్నేహమిత్ర ఫ్రెండ్స్ సర్కిల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ద్వితీయ దేవీ శరన్నవ రాత్రి మహోత్సవాల్లో భాగంగా శనివారం రాత్రి కూచిపూడి నృత్య ప్రదర్శన నిర్వహించారు. శ్రీనగర్‌కు చెందిన అను డ్యాన్స్ అకాడమీ నృత్యకారిణుల బృందం నాట్య గురువు అనుశేఖర్ పర్యవేక్షణలోనృత్య ప్రదర్శనలు ఆద్యంతం భక్తితన్మయత్వంలో ఓలలాడించాయి.

జయ జయహే మహిషాసురమర్దిని..



చేబ్రోలు ఆదికేశవస్వామి దేవస్థానంలో ప్రత్యేక అలంకారంలో రాజ్యలక్ష్మి అమ్మవారు



మంచాలలో పూజలు అందుకున్న అదిలక్ష్మి కామేశ్వరి అమ్మవారు



జొన్నలగడ్డలో అమ్మవారికి పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న ఎమ్మెల్యే మేకతోటి సుచరిత

దసరా వేడుకల్లో భాగంగా శ్రీ దేవీ శరన్నవ రాత్రి ఉత్సవాల్ని వాడవాడలా భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. పలుచోట్ల అమ్మవారు మహిషాసుర మర్దినిగా దర్శనమిచ్చారు. జొన్నలగడ్డ ట్రాన్స్‌ఫారం సెంటర్‌లో ఏర్పాటు చేసిన నవరాత్రి ఉత్సవాల్లో ఆదివారం ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే మేకతోటి సుచరిత పాల్గొన్నారు. అమ్మవారికి పట్టు వస్త్రాలు సమర్పించారు. గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో బతుకమ్మ సంబరాలు నిర్వహించారు. చారిత్రక ప్రసిద్ధి చెందిన చేబ్రోలులోని ఆదికేశవ స్వామి దేవస్థానంలో రాజ్యలక్ష్మి అమ్మవారు ప్రత్యేక అలంకారంలో దర్శనమిచ్చారు. పెదకాకాని భ్రమరాంబసమేత మల్లేశ్వరస్వామిదేవాలయంలో శ్రీదేవీ శరన్నవరాత్ర మహోత్సవాలలో భాగంగా ఆదివారం అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు.

– గుంటూరు రూరల్/ పెదకాకాని/ చేబ్రోలు



పెదకాకాని శివాలయంలో చిన్నారుల కూచిపూడి నృత్య ప్రదర్శన



పెదకాకాని శివాలయంలో దుర్గాదేవి అలంకారంలో భ్రమరాంబదేవి



చేబ్రోలు నాగేశ్వరస్వామి ఆలయంలో ..



గోరంట్ల శ్రీ వేంకటేశ్వరాలయంలో మహిషాసురమర్దినిగా..

వైఎస్సార్ సీపీలో చేరికలు

నగరంలోని 45వ డివిజన్ కార్పొరేటర్ యక్కల మారుతి, కోటి లింగారెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ నేత గురుబ్రహ్మాచారి నేతృత్వంలో టీడీపీ, బీజేపీకి చెందిన పలువురు కార్యకర్తలు పెద్దసంఖ్యలో ఆదివారం వైఎస్సార్ సీపీలో చేరారు. బృందావన్ గార్డెన్స్‌లోని విప్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే మద్దాళి గిరిధర్, నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, ఏఎంసీ చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు తదితరులతో కలసి శాసనమండలి విప్, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డి వారికి కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అప్పిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల కురుక్షేత్రానికి సమయం ఆసన్నమైందని తెలిపారు. ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్ రెడ్డి ఆలోచనలు, ఆశయాలే పునాదిగా.. ఒకే మాటగా.. ఒకే బాటగా.. ఇక కదన రంగంలో దూకడమే మనందరి ముందున్న తక్షణ కర్తవ్యమని చెప్పారు. అన్ని వర్గాలకు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు జరగాలంటే మళ్లీ జగనే సీఎం కావాలని ప్రతి ఒక్కరం ఇంటింటికీ పార్టీ జెండా భుజాన మోసుకు తిరుగుతూ సగర్వంగా సమాధానం చెప్పాల్సిన తరుణం ఇదేనని తెలిపారు. ఎమ్మెల్యే మద్దాళి గిరి మాట్లాడుతూ రాష్ట్రంలో పేదలు వర్సెస్ పెత్తందారులుగా పరిస్థితి మారిపోయిందన్నారు. పేదల పక్షాన ఒంటరి పోరాటానికి సిద్ధమైన సీఎం జగన్‌కు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. నగర మేయర్ కావటి మనోహర్‌నాయుడు, మార్కెట్ యార్డు చైర్మన్ నిమ్మకాయల రాజనారాయణ, జీడీసీసీ బ్యాంకు చైర్మన్‌రాతంశెట్టి సీతారామాంజనేయులు మాట్లాడుతూ సీఎంగా వై.ఎస్. జగన్ ప్రవేశపెట్టిన పథకాలకు ప్రజలతో పాటు అన్ని పార్టీల నేతలు, కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో గుంటూరు అర్బన్ బ్యాంక్ డైరెక్టర్ బందా రవీంద్రనాథ్, డెప్యూటీ మేయర్ షేక్ సజీల, రాష్ట్ర గ్రంథాలయ పరిషత్ అధ్యక్షుడు మందపాటి శేషగిరిరావు, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ బత్తుల దేవానంద్, దివ్యాంగుల కార్పొరేషన్ చైర్‌పర్సన్ ముంతాజ్ పఠాన్, కార్పొరేటర్లు, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, పార్టీ నేతలు పాల్గొన్నారు.

వృద్ధులకు బియ్యం, నిత్యావసర కిట్ల పంపిణీ

నగరంపాలెం: వృద్ధులు, దివ్యాంగుల్ని ప్రతి ఒక్కరూ ఆదుకోవాలని గిరిధారి మిత్ర మండలి అధ్యక్షుడు బవిరిశెట్టి శ్రీనివాసరావు కోరారు. కొత్తపేటలోని కార్యాలయంలో ఆదివారం యాభై మంది వృద్ధులు, దివ్యాంగులకు ఉచితంగా బియ్యం, నిత్యావసర కిట్లతో పాటు మహిళలకు చీరల్ని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ సామాజిక సేవ చేయడం వల్ల కలిగే సంతృప్తి ఎనలేనిదని పేర్కొన్నారు. కార్యక్రమంలో కార్యదర్శి పలకలూరి శివరావు, కోశాధికారి దిండు రాజశేఖర్, సభ్యులు పబ్బిశెట్టి సంజీవరావు, గార్లపాటి రోశయ్య, ఎన్.విజయలక్ష్మి, తాటికోల పద్మావతి పాల్గొన్నారు.

నేడు, రేపు 'బజరంగ్ నేత్రజ్యోతి' కళ్లజోళ్ల పంపిణీ: అంబటి మురళీకృష్ణ

చేబ్రోలు: దృష్టి లోపం సమస్య మనిషికీ, ప్రపంచానికీ మధ్య అడ్డుగోడ వంటిదని, దీన్ని నివారించేందుకే బజరంగ్ ఫౌండేషన్ నేత్రజ్యోతి పేరిట నిర్విరామ కృషిని కొనసాగిస్తున్నట్లు వ్యవస్థాపకులు అంబటి మురళీకృష్ణ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ లోకాన్ని చూడగలిగే అవకాశం దేవుడు అందరికీ ఇచ్చినా, అనేక కారణాలతో చాలామంది నేత్ర సమస్యలతో సతమతమవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్థిక స్తోమత లేని వెనుకబడిన వర్గాల వారు నేత్ర సమస్యలతోనే జీవితాన్ని ఈడుస్తున్నారని, ఇంకొందరు వైద్యం గురించి సరైన అవగాహన, చికిత్స విధానాలను గురించి తెలియక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఈ పరిస్థితుల్ని అధ్యయనం చేసిన బజరంగ్ నేత్ర జ్యోతికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. శేకూరులో ఈనెల 15న నిర్వహించిన బజరంగ్ జగన్నామ సంక్షేమ సంవత్సరంలో భాగంగా నేత్ర జ్యోతి శిబిరం నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో కళ్లజోళ్లు అవసరమైన 752మందికి సిద్ధం చేశామని చెప్పారు. సోమవారం వీరనాయకునిపాలెంలో 46మందికి, అనమర్లపూడిలో 53మందికి, తంగెళ్లమూడిలో 65మందికి అందిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం శేకూరులో 588మందికి కళ్లజోళ్లను పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం

కల్నల్ నీరజ్ కుమార్

గుంటూరు రూరల్: విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించేందుకు ఎన్‌సీసీ దోహదం చేస్తోందని కల్నల్ నీరజ్ కుమార్ పేర్కొన్నారు. చౌడవరంలోని ఆర్‌వీఆర్‌జేసీ ఇంజినీరింగ్ కళాశాలలో పదో ఆంధ్ర బాలికల బెటాలియన్ ఎన్‌సీసీ ఏటీసీ ఐదో క్యాంపు శిక్షణ తరగతులు ఆదివారం ప్రారంభించారు. వారం రోజుల పాటు నిర్వహించనున్నారు. కల్నల్ మాట్లాడుతూ క్యాంపులో ఎన్‌సీసీ క్యాడెట్స్‌కు ఫైరింగ్, డ్రిల్, టగ్‌అఫ్‌వార్, వాలీ బాల్, అథ్లెటిక్స్, రన్నింగ్, క్రీడా సాంస్కృతిక విభాగాల్లో శిక్షణను అందజేస్తూ దేశ రక్షణపై అవగాహనా, దేశభక్తి, జాతీయగీతం ఆవశ్యకతను తెలియజేయడం జరుగుతుందని చెప్పారు. శిక్షణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జనవరి 26న ఢిల్లీలో జరిగే రిపబ్లిక్‌డే పరేడ్‌లో పాల్గొనే అవకాశం లభిస్తుందన్నారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్.శ్రీనివాస్, సెక్రటరీ కరస్పాండెంట్ ఆర్.గోపాలకృష్ణ, ట్రజరర్ డాక్టర్ కె.కృష్ణప్రసాద్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, డైరెక్టర్ డాక్టర్ కె.రవీంద్ర, ఏఓ డైరెక్టర్ డాక్టర్ ఎన్వీ శ్రీనివాస్, డెప్యూటీ క్యాంపు కమాండెంట్ కల్నల్ రెజిత్ ముకుందన్, క్యాంపు ఎస్ఎం సుబేదార్ పాణ్యం రఫీ, క్యాంపు క్యూఎమ్ జేసీఓలు, ఎన్‌సీఓలు, ట్రైనింగ్ జేసీఓ నాయబ్ సుబేదార్ షేక్ ఖాజావలి, కళాశాల ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ డాక్టర్ తారాచంద్ పాల్గొన్నారు.

స్నేహితుల కుటుంబాలకు ఆర్థిక సాయం



పెదనందిపాడు: తమతో చదువుకున్న పలువురు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకున్న స్నేహితులు వారికి ఆర్థిక సాయం చేసి అండగా నిలిచారు. పెదనందిపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1986–87లో పదో తరగతి చదివిన వారంతా సేవా సంఘంగా ఏర్పడ్డారు. తమతో పాటు చదువుకున్న తోటి స్నేహితులకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఆ బ్యాచ్ విద్యార్థి, కొండపాటూరు అప్పర్ ప్రైమరీ పాఠశాల హెచ్ఎం శీలం అంకారావు ఆధ్వర్యంలో నగదు సేకరించారు. పఠాన్ జమీర్ హుస్సేన్(బాబు) భార్య జహీదా, దేటా ఇమ్మానియేలు భార్య శారమ్మ, తమ తోటి విద్యార్థిని రాచుమల్లు పద్మజకు రూ. 10వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో ఆ బ్యాచ్ విద్యార్థులైన కాకుమాను ఎంపీపీ రామినేని శ్రీనివాసరావు, నన్నపనేని శ్రీనివాసరావు, కట్టా రమేష్, పద్మజ, లీలా కుమారి, మేరి, రమాదేవి, అద్దంకి శ్రీను, కాకుమాను చెన్నకేశవులు పాల్గొన్నారు.

లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం



కోదండపాణి, పద్మావతిని సత్కరిస్తున్న ఆర్య సమాజం సభ్యులు

పాత గుంటూరు: అరండల్‌పేట ఆర్య సమాజం ప్రాంగణంలో పండిత గోపదేవ్ వైదిక ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో ఆదివారం లోక కల్యాణార్థం విశ్వశాంతి హోమం నిర్వహించారు. అనంతరం నిర్వహించిన సభకు డాక్టర్ కొండబోలు కృష్ణ ప్రసాద్ అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా వైదిక ధర్మ ప్రచారకులు డాక్టర్ కొసరాజు రవీంద్ర, మాగం కృష్ణమూర్తి, చైతన్య గోదావరి గ్రామీణ బ్యాంకు చైర్మన్ టి. కామేశ్వరరావు, ప్రచారకులు నాగభైరవ గంగా పార్వతి, కూరపాటి కల్యాణి రవీంద్ర పాల్గొన్నారు. ఈ సందర్భంగా అనంతపురం వైదిక ధర్మ ప్రచారకులు జి. కోదండ పాణికి ఆర్య పురుష బిరుదు, ప్రొద్దుటూరు ఆర్య సమాజం నిర్వాహకురాలు బి. పద్మావతికి ఆర్యమాత బిరుదు, నగదు అందించి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఆర్య సమాజం అధ్యక్షురాలు గుర్రం నిర్మలాదేవి, వ్యవస్థాపక కార్యదర్శి ఏలూరి సూర్యనారాయణ, కార్యదర్శి వాసిరెడ్డి శ్రీనివాస ప్రసాద్ పాల్గొన్నారు.

నేడు నగరపాలక సంస్థలో స్పందన రద్దు

నెహ్రూనగర్: నగరపాలక సంస్థలో సోమవారం జరగాల్సిన స్పందన కార్యక్రమాన్ని దసరా పండుగ సందర్భంగా రద్దు చేసినట్లు కమిషనర్ కీర్తి చేకూరి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నగర ప్రజలకు ఆమె దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.

అలరిస్తున్న వీణా అవార్డ్స్ నాటక పోటీలు

తెనాలి: కళల కాణాచి-తెనాలి, వేదగంగోత్రి ఫౌండేషన్-విజయవాడ సంయుక్త నిర్వహణలో తెనాలిలో నిర్వహిస్తున్న తృతీయ జాతీయ పద్యనాటక/సాంఘిక నాటికల పోటీలు వీణా అవార్డ్స్-2023 మూడో రోజు ఆదివారం కొనసాగాయి. శ్రీ టీబీఆర్ ఆర్ట్స్ థియేటర్, కూకట్‌పల్లి, హైదరాబాద్ వారి శ్రీస్వామి అయ్యప్ప పద్య నాటకాన్ని ప్రదర్శించారు. వల్లేటి లక్ష్మీ కులశేఖర్ రచించిన ఈ నాటకానికి టి.ఇందిరాదేవి దర్శకత్వం వహించారు. ధర్మశాస్త్ర/అయ్యప్పగా చిరంజీవి పి.హృషీకేశ్, శివుడు/రాజశేఖర పాండ్యుడుగా టి.బాబురాజు, విష్ణుమూర్తిగా బి.తులసీకృష్ణ, బ్రహ్మగా టి.వెంకటేష్, మోహిని, మహారాణిగ వెంగమాంబ సురభి నటించారు. సంగీతం డాక్టర్ ఎన్.చంద్రబాబునాయుడు సమకూర్చారు. సెట్స్ అండ్ లైటింగ్ సురభి సంతోష్ అందించారు. అనంతరం శ్రీకుమార భీమేశ్వర నాట్యమండలి, కాకినాడ వారి నర్తనశాల నాటకం ప్రదర్శించారు. కాళ్లూరి రామారావు రచనకు ఎస్‌కే అమీర్ దర్శకత్వం వహించారు. సాయంత్రం అభినయ ఆర్ట్స్-గుంటూరువారి సాంఘిక నాటకం 'ఇంద్రప్రస్థం'ను ప్రత్యేకంగా ప్రదర్శించారు. స్నిగ్ధ రచనకు ఎస్.రవీంద్రరెడ్డి దర్శకత్వం వహించారు. రాత్రి 7 గంటలకు సిరిమువ్వ కల్చరల్స్-హైదరాబాద్ వారి మాట్లాడుకుందాం సాంఘిక నాటికను ప్రదర్శించారు. మాడభూషి దివాకరబాబు రచనకు మంజునాథ్ దర్శకత్వం వహించారు. కళల కాణాచి గౌరవ సలహాదారు గోగినేని కేశవరావు, వ్యవస్థాపక కార్యదర్శి షేక్ జానీబాషా పర్యవేక్షించారు.